క్లుప్తంగా

కుట్టు మెషీన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మెషీన్లు అందజేస్తున్న మైనార్టీ సెల్ కన్వీనర్ యేసుబాబు

తుని రూరల్: దాతల సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ మండల కన్వీనర్ వడ్డాది యేసుబాబు అన్నారు. మంగళవారం తుని మండలం లోవకొత్తూరులో పాస్టర్ కె.రాజబాబు ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన ఫ్రెండ్స్ ప్రమోషన్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ కె.ఐజాక్ బెనర్జీ సమకూర్చిన 12 కుట్టు మిషన్లను ఆయన పంపిణీ చేశారు. ఉచితంగా మిషన్లు అందించడమే కాకుండ ట్రస్ట్ సౌజన్యంతో ఆరు నెలలు పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఉపాధి అవకాశాలకు సహకరిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సేవలు చిరస్మరణీయమన్నారు.

శ్రీదాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

గోకవరం: కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలో ద్విభాష్యం గోపికి చెందిన పామాయిల్ తోటలో మంగళవారం శ్రీదాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఈ విగ్రహ ప్రతిష్ఠ ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు సూర్యనారాయణవర్మ (రవివర్మ) చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, నవగ్రహ ఆరాధన తదితర పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ద్విభాష్యం సూర్యవెంకటసుబ్బారావు శర్మ, ద్విభాష్యం రవికిరణ్‌శర్మ, స్థానిక నాయకులు మంగరౌతు రామకృష్ణ, ఎస్‌డి శ్రీనివాస్, బుద్ధరాజు సుబ్బరాజు, గాజింగం రామలింగేశ్వరరావు, అమరా దొర తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంటపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

గోకవరం: పెంటపల్లి గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

భవానీలకు ప్రసాదం పంపిణీ



కృష్ణవరంలో భవానీలకు పులిహోర ప్యాకెట్లు అందజేస్తున్న బీజేపీ నాయకులు

కిర్లంపూడి: విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి వెళ్తున్న భవానీ భక్తులకు, పలువురు ప్రయాణికులకు బీజేపీ మండల అధ్యక్షుడు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. దేశప్రధాని నరేంద్రమోదీ విచార్ మంచ్ కార్యక్రమంలో భాగంగా కృష్ణవరం టోల్‌గేట్ వద్ద ప్రయాణికులకు పులిహోర, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరికాశీ విశ్వనాథం, వేగి భద్రం, జ్యోతుల దుర్గాప్రసాద్ పలువురు ఉన్నారు.

సారాతో ఇద్దరి అరెస్టు



పట్టుకున్న సారా, నిందితులతో ఎస్ఈబీ సిబ్బంది

ప్రత్తిపాడు: రాష్ట్ర స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ–సెబ్) మంగళగిరి కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు ప్రత్తిపాడు ఎస్ఈబీ సిబ్బంది మంగళవారం నిర్వహించిన దాడుల్లో 30 లీటర్ల సారాతో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ కథనం ప్రకారం మండల కేంద్రమైన ఏలేశ్వరంలో 25 లీటర్ల సారాతో టేకుమూడి ఎరుకమ్మను, ఐదు లీటర్ల సారాతో చిట్టిమేని మరిడమ్మను అరెస్టు చేశారు. వీరివురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. ఈదాడిలో మంగళగిరి ఎస్ఈబీ యూనిట్, ప్రత్తిపాడు ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారని ఎస్ఈబీ సీఐ తెలిపారు.



గోపాలపట్నంలో లలితా పరమేశ్వరీ అలంకరణలో నేరేళ్లమ్మ అమ్మవారు



తపోవనం ఆశ్రమంలో విశేష అలంకరణలో రాజరాజేశ్వరీ అమ్మవారు



తాళ్లూరులో రాజరాజేశ్వరీగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు



గోకవరం దేవీచౌక్‌లో రాజరాజేశ్వరీదేవి అవతారంలో కనకదుర్గమ్మ



వీరభద్రునిగద్దెలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ

అంబరాన్నంటిన దసరా సంబరాలు

- ముగిసిన శరన్నవరాత్ర ఉత్సవాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

తుని రూరల్: దసరా సంబరాలు అంబరాన్నంటాయి. అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గత నెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన శరన్నవరాత్రి మహోత్సవాలు ముగిశాయి. మంగళవారం దసరా పర్వదినాన్ని వైభవంగా జరుపుకొన్నారు. కొంత మంది సోమవారం దసరా ఉత్సవాన్ని జరుపుకోగా మరి కొంత మంది మంగళవారం పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో రాజరాజేశ్వరీ అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. వేదపండితులు, వేద విద్యార్థులు శ్రీరామ పట్టాభిషేక పారాయణం నిర్వహించారు. లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లో శరన్నవరాత్రి సందర్భంగా నెలకొల్పిన అమ్మవార్ల విగ్రహాలకు పూజలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా విజయదశమీ వేడుకలు

తొండంగి: మండలంలోని దసరా విజయదశమీ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గోపాలపట్నంలో నేరేళ్లమ్మ అమ్మవారిని లలితా పరమేశ్వరీ అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త యడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నేరేళ్లమ్మ అమ్మవారిని లలితాపరమేశ్వరీగా అలంకరించారు. పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అదేవిధంగా రావికంపాడు మహిషాసురమర్దిని ఆలయంలో దసర శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఒంటిమామిడి, వేమవరం, తొండంగి, శృంగవృక్షం, అద్దరిపేట, పెరుమాళ్లపురం ఎ.వి.నగరం తదితర గ్రామాల్లో దసరా సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నసమారాధనలు జరిగాయి.



రౌతులపూడిలో కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ప్రసాద్

రౌతులపూడిలో..

రౌతులపూడి: విజయ దశమి వేడుకలు మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్య భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రౌతులపూడిలోని కనకదుర్గ అమ్మవారిని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, ఆలయకమిటీ సభ్యులు ఉన్నారు.

దుర్గమ్మ.. రక్షించమ్మా..!

గండేపల్లి: తాళ్లూరు బాలాత్రిపుర సుందరి అమ్మవారు మంగళవారం రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు నవరాత్రులు పూర్తయిన సందర్భంగా అమ్మవారికి శమీ పూజ నిర్వహించి, ఆయుద పూజ చేశారు. మండలంలోని మల్లేపల్లి, గండేపల్లి, మురారి, నీలాద్రిరావుపేట తదితర గ్రామాల్లో విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కనకదుర్గ కరుణించంటూ భవాని భక్తులు అమ్మవారిని ఆరాధించి ప్రత్యేక పూజలు జరిపి అనంతరం కాలినడకన విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

శంఖవరంలో..

శంఖవరం: గ్రామాల్లో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సీతంపేట గ్రామంలో ఉన్న మీనాక్షి కనకదుర్గమ్మ అమ్మవారిని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు.

రాజరాజేశ్వరీదేవిగా కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలోని కనకదుర్గమ్మ మంగళవారం రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్ శర్మ అమ్మవారికి అలంకార పూజలు చేశారు. వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి నివేదించిన లడ్డూ, భక్తులు సమర్పించిన చీరలకు వేలం నిర్వహించారు. వీరభద్రునిగద్దెలోని కనకదుర్గమ్మ చివరి రోజు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కన్నుల పండుగగా తెప్పోత్సవం

కోటనందూరు: కాకరాపల్లి కనకదుర్గ ఆలయం వద్ద సోమవారం రాత్రి తెప్పోత్సవం కన్నుల పండవగా నిర్వహించారు. రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన కనకదుర్గమ్మను హంసవాహనంపై ఉంచి భారీ బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ఊరచెరువులో జలవిహారం చేయించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి తిలకించారు. అనంతరం అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ముగిసిన దసరా ఉత్సవాలు

ప్రత్తిపాడు: శరన్నవరాత్ర ఉత్సవాలు ముగిశాయి. సోమవారం విజయదశమిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. ప్రత్తిపాడులోని శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయ అర్చకుడు కొత్తలంక సాయి శమీ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



కాకరాపల్లిలో కనకదుర్గమ్మకు తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా శరన్నవ రాత్రులు

ఏలేశ్వరం: శరన్నవ రాత్ర ఉత్సవాలు నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఏలేశ్వరంలో తోటవీధిలో విజయదశమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయకమిటీల ఆధ్వర్యంలో రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల వద్ద మహిళలకు రవికలు, గాజులు, పసుపుకుంకుమలు పంపిణీ చేశారు. వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొత్తయర్రవరం గ్రామంలో దుర్గాదేవి ఆలయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే పర్వతపూర్ణచంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి అప్పలరాజు, నీరుకొండ సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.



కొత్తయర్రవరంలో దుర్గాదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఆటోలతో ఇబ్బంది



కోటనందూరులో బస్‌షెల్టర్‌కు ఎదురుగా నిలిపి ఉంచిన సీరియల్ ఆటో

కోటనందూరు: స్థానిక ఆర్టీసీ బస్‌షెల్టర్‌కు అడ్డంగా సీరియల్ ఆటోను నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులకు అసౌకర్యంతో పాటు ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. గతంలో ఈ బస్‌షెల్టర్‌ను చిరువ్యాపారులు ఆక్రమించేసి ప్రయాణికులకు నిలువు నీడ లేకుండా చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యను సృష్టించేవారు. ప్రయాణికుల నుంచి తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఇటీవల రెవెన్యూ, పంచాయతీ, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ, పోలీసు అధికారులు సంయుక్త ఆపరేషన్‌తో షెల్టర్‌ను ఖాళీ చేయించి ప్రయాణికుల సౌకర్యవంతంగా కుర్చీలు సైతం ఏర్పాటు చేశారు. కాగా స్థానిక ఆటో వాలాలు ఖాళీ చేయించిన షెల్టర్ ఎదురుగా తునికి వెళ్లే సీరియల్ ఆటోలను నిలిపి అక్కడే తిష్ట వేస్తున్నారు. ఫలితంగా ప్రయాణికులకు అసౌకర్యంతో పాటు ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. ఆటోవాలాల నిర్లక్ష్యం కారణంగా మంచి ఆశయంతో షెల్టర్ ఖాళీ చేయించినా.. ప్రయోజనం లేకుండా పోయిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే గత సమస్యలు మరోసారి పునరావృతమయ్యే ప్రమాదం ఉందని, సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వేర్వేరు చోట్ల చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

గండేపల్లి: వేర్వేరు చోట్ల సోమ, మంగళవారాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందినట్టు గండేపల్లి పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మల్లేపల్లికి చెందిన వల్లభశెట్టి రాము(72) గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో రోడ్డు దాటుతుండగా జగ్గంపేట మండల రాజపూడికి చెందిన వ్యక్తి వేగంగా మోటారు సైకిల్‌పై రాజమహేంద్రవరం వైపు వెళుతూ రామును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడుని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో రాజమహేంద్రవం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు తెలిపారు. ఇదిలా ఉండగా సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగ్గంపేట మండలం కాట్రావులపల్లికి చెందిన పి.నాగమణి(27) చికిత్స పొందుతూ మృతి చెందింది. అనారోగ్యం కారణంగా భర్త సుధాకర్ మృతురాలిని మోటారు సైకిల్‌పై రాజమహేంద్రవం ఆస్పత్రికి తీసుకువెళ్లి వస్తుండగా గండేపల్లి సమీపంలోని హోటల్ వద్దకు వచ్చే సరికి మోటారు సైకిల్‌పై నుంచి రోడ్డుపై పడిపోవడంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రురాలిని జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. వీటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు.

సాయిబాబా పుణ్యతిథి ఉత్సవాలు ప్రారంభం

బోట్‌క్లబ్: శ్రీ షిర్డి సాయిబాబా పుణ్యతిథి మహోత్సవాలు స్థానిక ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని ప్రాంగణంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాయిబాబాకు 108 కలశలతో పూజలు చేశారు. ఉదయం బాబావారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. రాత్రి సత్కళావాహిని వ్యవస్థాపక కార్యదర్శి ఈవీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో భక్తి సంగీత గానలహరి జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కుంజికా లక్ష్మి, పి.గాంధీగుప్త, మద్దిరాల కృష్ణ, జి కాత్యాయని, ఆకెళ్ల స్వాతిశ్రీ పాల్గొన్నారు.

తుప్పలు తొలగించరూ..



రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు

ఏలేశ్వరం: ఏలేరు ప్రాజెక్టుకు చెందిన రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. స్థానిక సాయిబాబామెట్ట నుంచి ప్రాజెక్టు గట్లను ఆనుకుని ఉన్న బీటీరోడ్‌కు ఇరువైపులా తుప్పలు భారీగా పెరిగిపోయాయి. ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా ప్రాజెక్టు సిబ్బందితో సమీపంలో నివాసాలు కూడా రాకపోకలు సాగిస్తుంటారు. తుప్పలు పెరిగిపోవడంతో పాముల బెడద ఎక్కువగా ఉండడంతో భయాందోళలకు గురవుతున్నారు. దీనిపై ప్రాజెక్టు అధికారులు స్పందించి తుప్పల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కార్తిక ఉత్సవాలకు రాట ముహూర్తం

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో కార్తిక మాసం సందర్భంగా నెల రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు సంబంధించి మంగళవారం ముహూర్తపు రాట వేశారు. దీపావళి మరుసటి రోజు నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుంది. ఈఓ డి.నాగమల్లేశ్వర రావు ఆధ్వర్యంలో కాలభైరవస్వామి ఆలయం వద్ద క్యూ లైన్లు, పందిళ్లకు సంబంధించి రాట ముహూర్తపు పూజ చేశారు. అనంతరం కాలభైరవస్వామి ఆలయం, ఉప ఆలయమైన సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయం వద్ద రాటలు వేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, బొంద లపు కృష్ణవేణి, చల్లా కుమారి, భక్త సంఘ నాయకులు బీవీ రమణ, చల్లా సత్తిబాబు పాల్గొన్నారు. ఆలయ అభిషేక పండితుడు వేమూరి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూజలు చేశారు. నవంబరు 13 నుంచి నెల రోజుల పాటు ఆలయంలో కార్తిక మాస ఉత్సవాలు జరుగుతాయి. ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపంతో ప్రతి రోజూ ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తారు. ఆలయంలో నిత్యం జ్యోతిర్లింగార్చన జరుగుతుంది. ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి ట్రస్టు బోర్డు, భక్తులతో సమావేశం నిర్వహిస్తామని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. కార్తిక మాస ఉత్సవాల్లో పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారి గ్రామోత్సవం, రాత్రి జ్వాలాతోరణం ఉంటుంది. స్వామివారి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ కోనేరులో తెప్పోత్సవం జరుగుతుంది. అమావాస్యను పురస్కరించుకుని కోటి దీపాలంకరణ, పోలి పాడ్యమి సందర్భంగా స్వామివారి జటాజూటం అలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయి.



ముహూర్తపు రాట వేసిన ఈఓ, ట్రస్టు బోర్డు సభ్యులు

ప్రత్తికూలం

- దిగుబడిపై రైతులకు దిగులు
- రెండింతలు తగ్గుతుందని అంచనా

తుని రూరల్: ఈ సంవత్సరం పత్తి దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయాలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి సాగు చేసినా వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండడంతో సాగుదారులు నష్టాలను ఎదుర్కొంటున్నారు. తొలకరిలో కొద్దిపాటి వర్షాలు కురవడంతో రైతులు ఆరుతడిగా సాగయ్యే పత్తి పంటను వేశారు. కొద్దిరోజులు తర్వాత అవసరానికి మించి వర్షాలు కురవడంతో పత్తి పైర్లు దెబ్బతిన్నాయి. కొంత మేరకు దెబ్బతినగా మరికొంత పంట ఏపుగా ఎదిగి ఆశించిన స్థాయిలో పూత, పిందె, కాయలు రాలేదు. దాని ప్రభావం పత్తి దిగుబడిపై తీవ్రంగా పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ డివిజన్ పరిధిలో గల తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో ఈ సంవత్సరం 1378 ఎకరాల్లో పత్తి సాగు జరిగింది. సాధారణంగా ఎకరాకు పది నుంచి 15 క్వింటాళ్ల పత్తి దిగుబడి లభించాల్సి ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో దెబ్బతిన్న పత్తి చేలల్లో నాలుగైదు క్వింటాళ్లు మించి దిగుబడి వచ్చే అవకాశాలు లేవని వి.కొత్తూరు, హంసవరం, టి.తిమ్మాపురం, తదితర గ్రామాల రైతులు పేర్కొన్నారు. దిగుబడులు తగ్గడంతో పంటపై పెంట్టిన పెట్టుబడులు రాబట్టుకోవడం కష్టమేనని వాపోయారు. ఇటీవల శాస్త్రవేత్తలో మండలాల్లో పర్యటించి పత్తిచేలను ఆశించిన పురుగులు, తెగుళ్లను గుర్తించడమే కాకుండ దిగుబడులను అంచనా వేశారు. అక్కడక్కడ రైతులు సేకరిస్తున్న పత్తికి నాణ్యతను బట్టి క్వింటాల్‌కు రూ.6620 నుంచి రూ.7020 గిట్టుబాటు ధర పలుకుతుందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

మండలం	సాగవుతున్న పత్తిచేలు
తుని	577 ఎకరాలు
కోటనందూరు	12.5 ఎకరాలు
తొండంగి	105 ఎకరాలు
శంఖవరం	132.5 ఎకరాలు
రౌతులపూడి	550 ఎకరాలు



వి.కొత్తూరులో అరకొరగా విచ్చుకున్న పత్తికాయలు

పెట్టుబడి లభించడం కష్టమే

పత్తిసాగుకు పెట్టిన పెట్టుబడి లభించడం కష్టమే. ఎకరాకు రూ.30వేలు వరకు పెట్టుబడి పెట్టాం. వర్షాకాలం సైతం ఎండలు తీవ్రంగా ఉండడంతో పత్తిచేలకు తడులు అందలేదు. తేమసైతం లేకపోవడంతో దిగుబడులు లేక పోవగా పత్తి మొక్కలు ఏపుగా ఎదిగిపోయాయి. దీంతో ఫలసాయం అందే రోజులు కుదించుకుపోతున్నాయి. అక్కడక్కడ విచ్చుకుంటున్న పత్తిని సేకరించి విక్రయించినా ఆశించినస్థాయిలో గిట్టుబాటు ధర లభించడంలేదు.

– పి.బాబురావు, రైతు, అగ్రహారం

దిగుబడి పై వాతావరణ ప్రభావం

దిగుబడులపై వాతావరణ ప్రభావం తీవ్రంగా ఉంది. వర్షాధారం కావడంతో పత్తి చేలకు తడులు లభించలేదు. ఇటీవల ఐదు మండలాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్య టించి పత్తి చేలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాధారణం కంటే ఎక్కువ ఎత్తు పత్తి మొక్కలు ఎదగడమే కాకుండ మొక్కకు 80 నుంచి వంద వరకు ఉండాల్సిన పత్తి కాయలు 35 నుంచి 45 వరకు ఉన్నట్టు గుర్తించారు. దీంతో పత్తి దిగుబడులు తగ్గుతాయని అంచనా వేస్తున్నాము.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

మద్యం మత్తులో కత్తితో దాడి

సామర్లకోట: తాగిన మైకంలో కత్తితో దాడి చేసిన సంఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన మార్ని శ్రీను, అదే గ్రామానికి చెందిన పుప్పాల రాంబాబు కలిసి మద్యం సేవించారు. మాటామాటా పెరగడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రాంబాబు కత్తితో శ్రీనుపై దాడి చేశాడు. ఈ సంఘటనలో శ్రీను చేతివేళ్లు రెండు తెగిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు వీరిని చెదరగొట్టారు. గాయపడిన శ్రీనును స్థానికులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు అక్కడి నుంచి స్థానిక పోలీసులకు సమాచారం అందింది. ఇరువర్గాల నుంచి తమకు ఫిర్యాదులు అందలేదని, ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేస్తామని సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు.

బస్ స్టేషన్‌లో వృద్ధురాలు

సామర్లకోట: భారంగా భావించిన కుటుంబ సభ్యులు ఓ వృద్ధురాలిని సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌లో వదిలిపోయిన సంఘటన ఇది. మంగళవారం మధ్యాహ్నం 3 సమయంలో ఆమెను విడిచిపెట్టిన వారు రాత్రి వరకూ రాకపోవడంతో.. అక్కడి ప్రయాణికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ట్రాఫిక్ ఏఎస్సై రత్నం అక్కడకు చేరుకుని వృద్ధురాలిని ఆరాతీశారు. కాకినాడ అని మినహా ఆమె ఏమి చెప్పలేకపోవడంతో, దిశ పోలీసు స్టేషన్‌కు సమాచారమిచ్చి, ఆమెను ఆటోలో కాకినాడ దిశ పోలీసు స్టేషన్‌కు పంపించారు.